www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 19 ఆగస్టు 2025
5
పశ్చిమ గోదావరి



గణపవరం మండలాన్ని పశ్చిమలోనే ఉంచాలని వినతి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోనే ఉంచాలని అంబేద్కర్ ఇండియన్ మిషన్ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు, జల్లికాకినాడ సర్పంచి బాతు నాగేశ్వరరావు మాట్లాడుతూ గణపవరం మండలం భీమవరానికి 24 కిలోమీటర్ల దూరంలో ఉందని చెప్పారు. ఏలూరు వెళ్లాలంటే 60 కిలోమీటర్లు ప్రయాణం చేయాలన్నారు. కొద్దిమంది గణపవరం మండలాన్ని మళ్లీ ఏలూరు జిల్లాలో కలపాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు కోరుకున్న విధంగా గణపవరం మండలాన్ని భీమవరంలోనే ఉంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.వెంకటేశ్వరరావు, జి.రవి, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షోభం వైపు.. ఆక్వా సాగు

- కలవరపెడుతున్న సుంకం
- సందిగ్ధంలో పడిన సాగు రైతులు
- అనుబంధ రంగాలపై తీవ్ర ప్రభావం


రొయ్యలు పట్టుబడి చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - కాళ్ల

ఒకపక్క ప్రకృతి వైపరీత్యాలు.. మరోవైపు అమెరికా సుంకాల దాడితో ఆక్వా సాగు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఇటు రైతులతోపాటు అటు వ్యాపారులు సైతం ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటి వరకూ సీడ్, ఫీడ్ ధరలు పెరగడం, మరోపక్క ప్రకృతి వైపరీత్యాలు, విద్యుత్ భారాలు వంటి సమస్యలతో ఆక్వా రైతులు సతమతమయ్యారు. ఆ సమస్యలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాకపోయినా సీడ్, ఫీడ్ ధరలు కొంత తగ్గడంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ భారాలపై ఏం చేయాలా అని మదనపడుతుండగానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల భారం విధించడంతో ఒక్కసారిగా రొయ్యల ధరలు కుదేలయ్యాయి. దీంతో అటు వ్యాపారులు, ఇటు రైతులు సైతం నష్టపోయే ప్రమాదం ఏర్పడింది.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రొయ్యల సాగు చాలా విస్తృతంగా ఉంది. రాష్ట్రంలో ఆక్వా (రొయ్యలు, చేపలు) చెరువులు 5.75 లక్షల ఎకరాల్లో ఉండగా, అందులో 2.63 లక్షల ఎకరాలు ఈ జిల్లాలోనే ఉన్నాయి. ఈ జిల్లాలో 60 శాతం విస్తీర్ణంలో సుమారు మూడు లక్షల టన్నుల రొయ్యలు ప్రతి సంవత్సరం ఉత్పత్తి అవుతున్నాయి. రూ.18 వేల కోట్ల వార్షిక టర్నోవర్ సాగుతోంది. ఎగుమతులు సైతం అమెరికాకే ఎక్కువ కావడం గమనార్హం. ఇప్పటికే 25 శాతం సుంకం అమల్లోకి రాగా, ఈ నెల 27 నుంచి మరో 25 శాతం అమలులోకి రానుంది.

భారీగా పడిపోయిన ధరలు

అమెరికా టారిఫ్ ప్రభావం ఏటా రూ.20 వేల కోట్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతులు చేసే ఆక్వా రంగంపై పడింది. సుంకాల భారం ప్రకటించగానే ఎగుమతిదారులు రొయ్యల ధరలను భారీగా తగ్గించేశారు. 25 కౌంట్ రొయ్య ధర కిలో రూ.565 నుంచి రూ.430కు తగ్గింది. మిగిలిన కౌంట్ల ధరలు సైతం కిలోకు రూ.35 నుంచి రూ.80 మేర తగ్గాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఎ) యాంటీ బయోటిక్ ఆరోగ్య ప్రమాణాలను కఠినతరం చేసింది. దీనివల్ల మందులు ఎక్కువ వాడిన రొయ్యలను తిరస్కరించే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు, ట్రేడర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ రాయితీ కల్పించాలి

గతంలో అసైన్డ్ భూముల్లో సాగు చేసే రొయ్యల చెరువులకు కూడా విద్యుత్ సబ్సిడీ ఇచ్చేవారు. అయితే గత వైసిపి ప్రభుత్వం రాయితీని ఎత్తివేసింది. దీంతో రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఉన్న భూములనే ఆక్వా జోన్ పరిధిలోకి తెచ్చి అసైన్డ్ భూములను మినహాయించింది. ఆక్వా జోన్‌లో ఉన్నప్పటికీ ఒక్కో రైతుకు 10 ఎకరాల వరకే విద్యుత్ రాయితీని ఇస్తామని గత ప్రభుత్వం మెలికపెట్టింది. ఇటీవల కూటమి ప్రభుత్వం ఆక్వా రంగాన్ని పరిశ్రమగా గుర్తించింది. మేత ధరలు తగ్గించింది. రూ.1.50కే యూనిట్ విద్యుత్ సరఫరా చేస్తోంది. ఆక్వా జోన్‌ను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటోంది. కేంద్రం కూడా రాయితీలు కల్పిస్తే అమెరికా విధించిన టారిఫ్ నుంచి గట్టెక్కే అవకాశం ఉందని అటు వ్యాపారులు, ఇటు రైతులు ఆశిస్తున్నారు.

20కిపైగా ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అనేక ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. ముఖ్యంగా భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు వంటి ప్రాంతాల్లో ఈ యూనిట్లు కేంద్రీకృతమై ఉన్నాయి. జిల్లాలో 20కిపైగా ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, 10కి పైగా ఆక్వా ఫీడ్ మిక్స్ యూనిట్లు ఉన్నాయి. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు జిల్లాలో ముఖ్యంగా భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలో 20కిపైగా ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. ఇవి చిన్న, మధ్య , పెద్ద తరహా పరిశ్రమలుగా ఉన్నాయి. సుమారు 80 వేల మంది వరకూ కార్మికులు పని చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆక్వా ప్రాసెసింగ్ పరిశ్రమ జిల్లా ఆర్థిక వ్యవస్థకు ఒక ముఖ్యమైన భాగం. ఇది ఎగుమతులు, స్థానిక వినియోగం రెండింటికీ దోహదం చేస్తోంది. వ్యాపారులు రొయ్యలను కొనుగోలు చేసిన తర్వాత కోల్డ్ స్టోరేజీల తీసుకొచ్చి వాటిని ప్రాసెస్ చేసి, భద్రపర్చి అనంతరం విదేశాలకు ఎగుమతి చేస్తారు. అయితే చెరువుల నుంచి నేరుగా వచ్చిన రొయ్యల తలలను తొలగించి, శుభ్రం చేసేందుకు పెద్దసంఖ్యలో కార్మికులు అవసరం. రొయ్య వలుపు కార్మికులు సుమారు 50 వేల మంది పని చేస్తున్నారు.

సుంకాల భారాన్ని కేంద్రం భరించాలి..

మంతెన పెదనరసింహమూర్తిరాజు, ఆక్వా రైతు, కలవపూడి



సుంకాల భారాన్ని కేంద్రప్రభుత్వం భరించాలి. సుంకాల పెంపుదలను తీవ్రంగా ఖండిస్తున్నాం. పన్ను పెంచితే అమెరికాలో ధరలు పెరుగుతాయి. ఆ ప్రభావం అక్కడి వినియోగదారులపై పడుతుంది. కొన్ని దేశాలకు ఒకరకంగా, మరికొన్ని దేశాలకు మరొక రకంగా పన్ను విధించడం సరికాదు. పన్ను వల్ల గందరగోళ పరిస్థితి ఏర్పడింది. బయ్యర్లు ఎగుమతులు ఆపేయాలని చెప్పారు. కంటైనర్లు ఆగిపోయాయి. మిత్ర దేశం అంటూనే ఈవిధంగా చేయడం సరికాదు. ప్రధాని నరేంద్రమోడీ చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం చూపించే ప్రయత్నం చేయాలి. రైతులు, వ్యాపారులు ఇతర దేశాలకు రొయ్యలు ఎగుమతి చేసే విషయంపై దృష్టి పెట్టాలి.

పన్ను తగ్గించేలా చూడాలి..


కంతేటి శ్రీనివాసరాజు, ఆక్వా రైతు, ప్రాతళ్లమెరక



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన పన్ను వల్ల ఆక్వా రైతులు కుదేలవుతున్నారు. ఇదేవిధంగా కొనసాగితే ఆక్వా రంగం ముందుకు సాగదు. ప్రభుత్వం చర్చించి పన్ను మొత్తం 20 శాతానికి తగ్గించే విధంగా చూడాలి. రాష్ట్రం నుంచి ఆక్వా ఉత్పత్తులు 60 శాతం అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. పన్ను పెంచడం వల్ల హేచరీలు, రైతులు, హేచరీలు, మందుల దుకాణాలు మొత్తం దెబ్బ తినే ప్రమాదం ఉంది. గతంలో ఎనిమిది శాతం పన్ను మాత్రమే చెల్లించేవారు. ఇప్పుడు 50 శాతానికి పెంచడం దారుణం. దేశంలో ఆక్వా ఉత్పత్తులు అధికంగా ఎగుమతి చేసేదానిలో మన రాష్ట్రం ప్రథమస్థానంలో ఉంది. విదేశీ మారక ద్రవ్యం దీని ద్వారా అధికంగా వస్తుంది. దీనిని కాపాడుకునేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

మౌలిక వసతుల కల్పనకు సమన్వయంతో కృషి చేయాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ఐసిడిఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఐసిడిఎస్, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 489 అంగన్వాడీ కేంద్రాలకు రూ.16 వేలు చొప్పున కేటాయించిన నిధులతో గుర్తించిన పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్, ఐసిడిఎస్ అధికారులు సమన్వయం చేసుకుని సుమారు 35 అంగన్వాడీ కేంద్రాలను ఒక గ్రూపుగా తీసుకుని వాటికి కేటాయించిన మొత్తంతో పనులను చేపట్టాలన్నారు. డ్రెయినేజీ సౌకర్యం, స్టోరేజీ ఎక్విప్‌మెంట్, పెయింటింగ్, మెస్సింగ్, బాత్రూమ్‌లో టైల్స్ వంటి పనులను చేపట్టాలన్నారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, పంచాయతీరాజ్ ఎస్ఇ బివి.గిరి, డిఇఇ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి


మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండడంతోపాటు అందుబాటులో ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. అత్యవసర సమాచారాన్ని ప్రజలు, అధికారులు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 08816 299181 నెంబర్‌కు తెలియజేయాలన్నారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆయన సోమవారం భారీ వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, తహాశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇరిగేషన్, డ్రెయిన్స్, వివిధ శాఖల జిల్లా అధికారులతో వెబెక్స్ ద్వారా సమీక్షించారు. ముంపునకు గురైన పొలాల్లోని నీరు బయటకు వెళ్లేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలువలకు, డ్రెయిన్లకు గండ్లు పడకుండా బలహీనమైన చోట్ల గట్లను పటిష్టం చేయాలన్నారు. రాబోయే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురియనున్న దృష్ట్యా ఎక్కడైనా గ్రామాలు ముంపు బారిన పడే అవకాశం ఉంటే ఆయా ప్రాంతాల్లోని ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లంక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అధికారులంతా జిల్లా ప్రధాన కేంద్రంలో ఉండాలని, ఏ ఒక్కరికీ సెలవులు మంజూరు చేయొద్దని ఆదేశించారు.

నీట మునిగిన వరి చేల పరిశీలన


నీట మునిగిన వరిచేలను పరిశీలిస్తున్న జెసి

ప్రజాశక్తి - గణపవరం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొమ్మరలో నీట మునిగిన వరి చేలను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి సోమవారం పరిశీలించారు. తొలుత స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో కొమ్మర గ్రామ దస్త్రాలను పరిశీలించారు. మ్యూటేషన్ ఫైల్స్ పరిశీలించి, డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటేనే ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట పొలాల నుండి వర్షపు నీరు తగ్గాక వరినాట్లు పనికి రాకపోతే తక్కువ సమయంలో పంట చేతికొచ్చే రకాలను సాగు చేయించాలని సూచించారు. వల్లూరులో ప్రభుత్వ భూముల రీసర్వేను పరిశీలించారు. వెంకయ్య వయ్యేరు నీటి ప్రవాహ ఉధృతిని పరిశీలించారు. కార్యక్రమంలో తహాశీల్దార్ వైకెవి.అప్పారావు, వ్యవసాయ శాఖ జెడి జడ్.వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ ఎం.వంశీ పాల్గొన్నారు.

21న ఆక్వా రైతుల సదస్సు

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆకుల హరే రామ్

ప్రజాశక్తి - ఉండి

ట్రంప్ టారిఫ్‌లతో కుదేలైన ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని, సుంకాల భారాన్ని తగ్గించి కనీస మద్దతు ధర నిర్ణయించాలని కోరుతూ ఈ నెల 21వ తేదీ గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు ఉండి మార్కెట్‌యార్డులో ఆక్వా రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ తెలిపారు. ఈ సదస్సును జయప్రదం చయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో సదస్సు గురించి ప్రచారం చేస్తూ కరపత్రాలు పంచారు. జిల్లాలో మూడు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారన్నారు. సాగులో 80 శాతం చిన్న, సన్న కారు రైతులే చేస్తున్నారని, ట్రంప్ సుంకాల భారంతో లక్షలాది మంది రైతులు అయోమయంలో పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ సంక్షోభం నుండి బయటపడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్త శుద్ధితో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో జీను ఆదినారాయణ, నక్కా వెంకటేశ్వర్లు, గండికోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వాసుదేవరావు

పోరాటాలతోనే హక్కుల సాధన

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు


ప్రజాశక్తి - భీమవరం టౌన్

పోరాటాలతోనే మన హక్కులను, సమస్యలను పరిష్కరించుకోగలమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు పిలుపునిచ్చారు. సిఐటియు మండల మహాసభ సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎన్.గోవిందమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు, ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.20 వేల లక్షల కోట్ల రుణాలు రద్దు చేసిందని, అయితే స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు మాత్రం ఇవ్వడానికి చేతులు రావడం లేదని విమర్శించారు. రోజురోజుకీ నిత్యావసరాల ధరలు పెరిగి వేతనాలు సరిపోక నానావస్థలు పడుతున్నారన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఇంజేటి శ్రీనివాస్, కోకన్వీనర్‌గా ఎన్.గోవిందమ్మతోపాటు సభ్యులుగా మరో 15 మంది ఎన్నికయ్యారు. ఈ మహాసభలో దీపిక, విమల కుమారి, నక్క హేమలత, ఎం.గంగాధర్, జి.కనకదుర్గ, బంగారయ్య, కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటప్రసాద్ దంపతులు అభినందనీయులు

ప్రజాశక్తి - మొగల్తూరు

తీర ప్రాంతంలో చిన్నారుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న వైద్యులు గొన్నాబత్తుల వెంకట ప్రసాద్, నందిని దంపతులు అభినందనీయులని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ అన్నారు. మండలంలోని పేరుపాలెం సౌత్‌లో గొన్నాబత్తుల వెంకటప్రసాద్, నందిని దంపతులు సుమారు రూ.పది కోట్లు వెచ్చించి రెండున్నర ఎకరాల్లో 30 తరగతి గదులతో నిర్మించిన విద్యారణ్య భారతీయ విద్యా కేంద్రం (సిబిఎస్ఇ) నూతన భవనాన్ని ఆయన, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి వర్మ విలేకరులతో మాట్లాడారు. తీర ప్రాంతంపై మక్కువతో ఈ ప్రాంతం వాసులు కానప్పటికీ ఇక్కడ నివాసం ఏర్పాటు చేసుకుని, ఇక్కడ ప్రజల అభివృద్ధికి చేస్తున్న సేవలు ఎనలేనివని అన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలు, మత్స్యకారులు నివసించే మారుమూల ప్రాంతమైన పేరుపాలెంలో పిల్లలకు మంచి విద్యను అందించాలనే సంకల్పంతో ముందుకొచ్చి అన్ని సౌకర్యాలతో కూడిన మంచి స్కూలును నిర్మించిన గొన్నాబత్తుల వెంకటప్రసాద్, నందిని దంపతులు, కుటుంబ సభ్యులను అభినందించారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్ వర్మ, కలెక్టర్ నాగరాణి

కల్లుగీత కార్మికులకు మూడు బార్‌లు కేటాయింపు

లాటరీ తీసిన కలెక్టర్ నాగరాణి

28 ఓపెన్ బార్‌ల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం


లాటరీ తీస్తున్న కలెక్టర్ నాగరాణి


ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో కల్లుగీత కార్మికులకు కొత్తగా మంజూరైన మూడు బార్లకు కలెక్టరేట్లో జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం లాటరీ తీశారు. కల్లుగీత కార్మికులకు కేటాయించిన బార్ల ఎంపిక రిజర్వేషన్ ప్రక్రియను కలెక్టర్ నాగరాణి స్వయంగా లాటరీ తీసి ఎంపిక చేశారు. జిల్లాకు సంబంధించిన గీత కార్మిక, శెట్టిబలిజలకు-2, గౌడ - 1కు భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు పట్టణాల్లో బార్లు కేటాయించడం జరిగింది. బిసి కులస్తులు ఈ నెల 20 నుంచి 29వ తేదీ సాయంత్రం వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 30వ తేదీన డ్రా తీసి బార్లను కేటాయించడం జరుగుతుందన్నారు. అలాగే జిల్లాకు ఓపెన్ క్యాటగిరీ కింద కేటాయించిన 28 బార్ల మంజూరుకు ఈ నెల 18 నుండి 26వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని 28వ తేదీన లాటరీ ద్వారా బార్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి కెవి.నాగలింగ ప్రభుకుమార్, సిఐలు కెఎస్‌వి.కళ్యాణ్ చక్రవర్తి, కె.బలరామరాజు, భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు ఎక్సైజ్ అధికారులు, కల్లుగీత కార్మికులు పాల్గొన్నారు.

పేదలను ఇబ్బంది పెట్టడం దారుణం

ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు తొలగిస్తారా

సిపిఎం మండల కార్యదర్శి అశ్రియ్య


కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న దశ్యం

ప్రజాశక్తి - పాలకోడేరు

మోగల్లు సుబ్బరాజు చెరువు గట్టు ప్రాంత పేదలను అధికారులు ముప్పుతిప్పలు పెట్టడం దారుణమని సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య విమర్శించారు. ప్రత్యామ్నాయం చూపించకుండా ఇళ్లు తొలగిస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సుబ్బరాజు చెరువు గట్టు ప్రాంత పేదల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా పంచాయతీ అధికారి, పాలకోడేరు తహాశీల్దార్, మోగల్లు పంచాయతీ కార్యదర్శికి బాధిత ప్రజలు, సిపిఎం నేతలు సోమవారం వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అశ్రియ్య మాట్లాడుతూ ఇళ్లు తొలగించేందుకు పదేపదే నోటీసులివ్వడం దారుణమన్నారు. ఇళ్ల తొలగింపుపై ఉన్న శ్రద్ధ ప్రత్యామ్నాయం చూపడంపై లేదనివిమర్శించారు. ఎన్నోఏళ్ల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నా లేని ఇబ్బంది ఇప్పుడెందుకు వచ్చిందని ప్రశ్నించారు. వెంటనే ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన డిపిఒ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకన్న, వాసు, బాబి, సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి మా లక్ష్యం

డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు



అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - ఆకివీడు

కళాశాల అభివృద్ధికి ఎల్ఐసి సహకరించడం ఎంతో ఆనందంగా ఉందని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. జీవిత బీమా సంస్థ కార్పొరేట్ సామాజిక విభాగం గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ సహకారంతో రూ.1.06 కోట్ల వ్యయంతో మండలంలోని వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆయన, కలెక్టర్ నాగరాణి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ కోటి రూపాయలు విరాళం అందించడం ఎంతో ఉన్నత ఆశయమని కొనియాడారు. కళాశాలకు కావలసిన మిగిలిన అవసరాలన్నీ తీరుస్తామని, వచ్చే జూన్ నాటికి పూర్తిస్థాయి రూపంతో కొత్త అడ్మిషన్లు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు, కళాశాల ప్రణాళిక అభివృద్ధి శాఖ విభాగం కార్యదర్శి డాక్టర్ పిబి.ప్రతాప్ కుమార్, ప్రముఖులు చిలువూరి కృష్ణరాజు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు గుంట్ల కృష్ణమూర్తి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శారద, నియోజకవర్గంలోని ప్రముఖులు, కళాశాల అభివృద్ధి సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'సొసైటీల ఛైర్మన్లు రైతు రుణమాఫీకి కృషి చేయాలి'

ప్రజాశక్తి - నరసాపురం

సొసైటీల నూతన ఛైర్మన్లు రైతు రుణమాఫీకి కృషి చేయాలని ఎర్రంశెట్టివారిపాలెం మాజీ సర్పంచి, రైతు నేత కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు కోరారు. తొలుత నర్సాపురం, మొగల్తూరు మండలాలు, పట్టణ పరిధిలోని సొసైటీలకు నూతనంగా ఎంపికైన సొసైటీ ఛైర్మన్లు, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలను గుర్తించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం ద్వారా రైతు రుణమాఫీ చేసేందుకు కృషి చేయాలన్నారు. అన్ని రంగాల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు రుణమాఫీ చేసి తిరిగి నూతన రుణాలు ఇవ్వడం ద్వారా రైతులకు చేయూతనివ్వాలని కోరారు.

నేడు సిపిఐ ఆధ్వర్యాన ప్రదర్శన, సభ

విచ్చేయనున్న రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

సిపిఐ 27వ జిల్లా మహాసభ సందర్భంగా ఈ నెల 19న తణుకు పట్టణంలో ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వమిస్తున్నామని, దీనికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తెలిపారు. వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఎస్‌సిఐఎం డిగ్రీ కళాశాల వద్ద నుంచి ప్రజాప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కారక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు పాల్గొంటారన్నారు. 20న ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. సమావేశంలో నేతలు బొద్దాని నాగరాజు, సికిలే పుష్పకుమారి, ఎం.సీతారాం ప్రసాద్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

నీట మునిగిన వరి పొలాల పరిశీలన

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో భారీ వర్షాల కారణంగా 1,095 ఎకరాల్లో పంట పొలాలు ముంపునకు గురైనట్లు పాలకొల్లు ఎడిఎ పి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని ఆచంట, పెనుమంచిలి, ఆచంట వేమవరం గ్రామాల్లో ముంపునకు గురైన వరి చేలను ఎడిఎ మురళీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు, తహశీల్దార్ జి.కనకరాజు సోమవారం పరిశీలించి రైతుతో మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో వరి చేను ఊడ్చిన దశ నుంచి పిలకలు దశలో ముంపునకు గురైందని తెలిపారు. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన ఎంటియు 1318, స్వర్ణ, సంపద స్వర్ణ, ఎంటియు 1061, ఎంటియు 1064 రకాలు ఐదు రోజుల వరకూ ముంపును తట్టుకునే గుణం ఉందన్నారు. పిలకల దశలో మునిగితే సాధారణ రకాలు 5 రోజుల వరకూ ముంపును తట్టుకుంటాయన్నారు. ముంపును ఎంటియు 1064, పిఎల్ఎ 1100 వంటి రకాలు వారం రోజుల వరకూ తట్టుకుంటాయని తెలిపారు. పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరిపొలంలో వీలైనంత త్వరగా నీటిని తీసివేసి ఎకరాకు 20 కిలోల యూరియా, 10 నుంచి 15 కిలోల పొటాష్ అదనంగా ఎరువుల కోట వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గణేశుల సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.


పెనుమంచిలిలో పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

పెనుమంట్ర : అధిక వర్షాలకు ముంపు బారిన పడిన వరి పైరును జాగ్రత్తగా రక్షించుకోవాలని మార్టేరు ఆచార్య ఎన్‌జి.రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ఎం.గిరిజారాణి, ఫార్మ్ ఎడిఆర్ టి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పొలాలను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. నారుమడిలో విత్తనం చల్లిన వెంటనే మూడు కన్నా ఎక్కువ రోజులు నీటిలో ఉంటే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. త్వరగా మడిలో నుండి నీరు బయటకు తీసి పొలం ఆరబెట్టాలన్నారు. ఈ వాతావరణంలో ఆశించే తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 1.0 గ్రాముల కార్బెండిజిమ్ లేదా 2.0 గ్రాముల కార్బెండిజిమ్, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలి.


పెనుమంట్రలో..

పాలకొల్లు రూరల్ : శివదేవునిచిక్కాలలో నీటి మునిగిన వరి చేలను ఎడిఎ పి.మురళీకృష్ణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎఒ కె.రాజశేఖర్, తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, విఆర్ఒ నాగరాజు, విఎఎ లింకన్, రైతులు పాల్గొన్నారు.

ఉండి: ముంపునకు గురైన పంట పొలాలకు సరైన మెళకువలు తీసుకుంటే పంట నష్టాన్ని తగ్గించవచ్చని మండల వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కోలమూరు, ఉప్పులూరు, ఎన్ఆర్‌పి అగ్రహారం, ఉండి గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలను శ్రీనివాస్ పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో వరి ఊడ్చిన దశ నుండి పిలకలు దశలో నీట మునిగిందని తెలిపారు. వీలైనంత త్వరగా పొలం నుండి నీరు బయటకు తీసి వేసి పొలం ఆరబెట్టాలని తెలిపారు.


మొగల్తూరులో శిథిలావస్థకు చేరుకున్న పశు వైద్య కేంద్రం

శిథిలావస్థలో పశువుల ఆసుపత్రి

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పశువుల ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనాన్ని సుమారు 30 సంవత్సరాల కిందట నిర్మించారు. ఆ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో సుమారు 8 సంవత్సరాల కిందట మరమ్మతులు చేపట్టారు. అయినా వర్షం వస్తే స్లాబ్ నుండి నీరు లీకై లోపలకు వస్తోంది. దీంతో ఆస్పత్రిలోని దస్త్రాలు విలువైన మందులు, సామగ్రి తడిసి పాడవుతున్నాయి. శిథిల భవనాన్ని తొలగించి ఆసుపత్రికి నూతన భవన నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆచంట

గోదావరికి వరదల నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ బివిఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరి వరద, భారీ వర్షాల పై ప్రజలను అప్రమత్తం చేయడం, అవసరం మేరకు పునరావాస కేంద్రాలు గుర్తించి రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, స్వమిత్వ సర్వే పురోగతి, కౌశలం, సిటిజెన్ ఆక్టివిటీ, పి4 సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన బర్త్ డెత్ సర్టిఫికెట్ జాప్యం లేకుండా జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎఒ పూర్ణబాబ్జి, డిప్యూటీ ఎంపిడిఒ బురి సూరన్న, కార్యదర్శులు హనుమంత రావు, నాగబాబు, వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - వీరవాసరం


ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల యూనియన్ వీరవాసరం ఏరియా సమావేశం వరలక్ష్మి అధ్యక్షతన సోమవారం వీరవాసరంలో జరిగింది ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పనిభారం పెరిగిందని, ప్రసూతి సెలవు, గ్రాట్యుటీ ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని, వేతనాల సమస్యను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు, కరెంటు ఛార్జీలు వంటి అనేక భారాలు పెరిగిపోవడంతో ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని పలు దశల్లో ఆందోళనలు చేశామని తెలిపారు. జీతాలు కాకుండా కంటి తుడుపు చర్యగా కొన్ని హామీలను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. వేతనాలు ప్రకటించకుండా ఉండడమే బాధాకరమన్నారు. వేతనాలు పెంపు కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల, వెంకటలక్ష్మి, సుబ్బలక్ష్మి, శ్యామల తదితరులు మాట్లాడారు.

మెగా అభిమానుల సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - నరసాపురం

చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలను పురస్కరించుకుని అభిమానులు చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని తహశీల్దార్ అయితం సత్యనారాయణ అన్నారు. నాలుగవ రోజు చిరంజీవి యువత మండల ఉపాధ్యక్షుడు తెంగాశెట్టి సూర్యనారాయణ ఆధ్వర్యంలో పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన ఐడెంటీ కార్డులను విద్యార్థులకు అందించారు. అనంతరం స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గ్రంధి జగదీశ్, అభిమానులు కోపల్లి శ్రీనివాస్, పోలిశెట్టి సత్తిబాబు, గుగ్గిలపు శివఆనందకృష్ణ, చెన్నంశెట్టి నాగు, అయితెట్టి చిట్టిబాబు, కొనిశెట్టి సుబ్బారావు, గంగాధర్, తెంగాశెట్టి రాంబాబు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజు వారోత్సవాలు సోమవారం పెదమామిడిపల్లిలో మెగా పవర్ యూత్ చేట్రోలు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చిరంజీవి యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు పాల్గొని గ్రామంలో వందకు పైగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తులా రామలింగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చేట్రోలు కృష్ణమోహన్, పరిం నవీన్, రాపాక నరేంద్ర, కాలేపు చిట్టి కాసులు,కాండ్రేకుల కిషోర్ పాల్గొన్నారు.


క్యాంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సైలింగ్ బోటింగ్‌కు వంద మంది క్యాడెట్లు

ప్రజాశక్తి - నరసాపురం

వచ్చే నెల 1 నుంచి 10వ తేదీ వరకూ ఒరిస్సాలోని చిలుక నేవిల్ బేస్లో నరసాపురం ఆంధ్రా యూనిట్ ఆధ్వర్యంలో సైలింగ్ బోటింగ్ సాహస యాత్రను నిర్వహించనున్నారు. ఈ యాత్రలో తెలుగు రాష్ట్రాల నుంచి 100 మంది క్యాడెట్లు పాల్గొనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లను యూనిట్ కమాండర్ సంజిత్ రౌత్రే, డిప్యూటీ క్యాంపు కమాండర్ అనిల్ యాదవ్ పర్యవేక్షిస్తున్నారు. సోమవారం పట్టణంలోని కాటన్ పార్క్ వద్దనున్న నేవిల్ యూనిట్‌లోని బోట్లను రెడీ చేసే పనులు చేపట్టారు. వీటిని ఒరిస్సాకు తరలించనున్నారు. ఈ సాహస యాత్రలో పాల్గొనే క్యాడెట్లకు బోటింగ్, సిమ్మింగ్, ఫైరింగ్, డ్రిల్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు కమాండర్ రౌత్రే చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లోని నేవీ యూనిట్లు వివిధ పరీక్షలు నిర్వహింటే ప్రతిభ ఉన్న క్యాడెట్లను ఎంపిక చేశారు. వీరంతా పది రోజుల పాటు ఒరిస్సాలో క్యాంపులో శిక్షణ పొందనున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ క్యాంపుకు 16 మంది ట్రైనర్లు, 12 మంది ఇతర సిబ్బంది హాజరుకానున్నట్లు కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ సి.రోహిత్ తెలిపారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలని

1న పెన్షన్ మార్చ్

నరసాపురం: పాత పెన్షన్ విధానం కోసం ఎపి సిపిసిఎస్ఇఎ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ నుంచి విజయవాడ వరకూ చేసే పెన్షన్ మార్చ్ ర్యాలీని ప్రతి సిపిఎస్ ఉద్యోగి జయప్రదం చేయాలని గ్రామ, వార్డు, సచివాలయ ఉద్యోగుల సంఘం డెమోక్రటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.జోసెఫ్ కిషోర్, నరసాపురం మండల కమిటీ అధ్యక్షుడు పి.మదన్మోహన్ అన్నారు. చలవపేటలోని అంబేద్కర్ భవనంలో మండల కార్యవర్గ ఉద్యోగులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జి.జోసెఫ్ కిషోర్ మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగి హక్కు అని, ప్రభుత్వాలు హామీలు ఇవ్వడమే కాదు, వాటిని అమలు చేయాలని తద్వారా ఉద్యోగులకు వారికి హక్కుగా రావాల్సిన వాటిని అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ విజయసుధ వైస్ ప్రెసిడెంట్, ఎమ్‌డి షానూర్ ఖాన్ జనరల్ సెక్రటరీ, ఇ.ఉదయ్ కుమార్ జాయింట్ సెక్రటరీ, ఎల్.ఏడుకొండలు ట్రెజరర్, ఎం.బాలచంద్ర, ఇసి మెంబర్, కృష్ణ పాల్గొన్నారు.

ఎనిమిది మంది మందుబాబులకు జరిమానా

కాళ్ల: మద్యం తాగి వాహనం నడిపిన ఎనిమిది మందికి జడ్జి రూ.80 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. గతంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 8 మందిపై నమోదు చేసిన కేసులకు భీమవరం స్పెషల్ జ్యూడీషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచామన్నారు. మేజిస్ట్రేట్ ఎంఎస్ఎన్ రాజారావు సదరు వ్యక్తులకు ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున రూ.80 వేలు జరిమానా విధించారన్నారు.


పండిత విల్లూరులో త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

పండితవిల్లూరు సొసైటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పోడూరు

రైతులకు మెరుగైన సేవలందించాలని ఎంఎల్ఎ పితాని తనయుడు పితాని వెంకట్ అన్నారు. పండిత విల్లూరు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం అట్టహాసంగా జరిగింది. ఎంఎల్ఎ తనయుడు వెంకట్ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సొసైటీ వల్లప్రోలు అధ్యక్షుడిగా పిల్లి రామకృష్ణ, సభ్యులుగా నామాల శ్రీనివాసు, కడలి విజయ లక్ష్మీప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ సొసైటీ ద్వారా నూతన పాలకవర్గం రైతులకు మెరుగైన సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు నామాల శ్రీనివాసు, కె.రాము, బొక్కా నాగేశ్వరరావు, టిడిపి పెనుమంట్ర మండల అధ్యక్షులు వెలుగల బులిరామరెడ్డి, రుద్రరాజు రమేష్ బాబు, రుద్రరాజు రవిరాజు, గణపతినీడి రాంబాబు, బోడపాటి దుర్గాప్రసాద్, కారుమిల్లి నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ఛైర్మన్ కె సత్యనారాయణ

పాలిటెక్నిక్ తరువాత బిటెక్ చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

సీతారామపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లమా మొదటి సంవత్సరం ఓరియంటేషన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కోశాధికారి కొండవీటి త్రినాధస్వామి, ప్రిన్సిపల్ ఎస్.సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎ.గోపీచంద్, స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్మయి పాల్గొన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్మయి మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సుల ప్రాధాన్యత, ఆ కోర్సుల ద్వారా వచ్చే ఉద్యోగావకాశాలను వివరించారు. కాలేజీ ప్రిన్సిపల్ ఎస్.సురేష్‌కుమార్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ తరువాత బిటెక్ విద్యనభ్యసించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. కాలేజీ వైస్ ప్రిన్సిపల్ ఎ.గోపీచంద్ సాంకేతిక విద్యనభ్యసించడం వల్ల వచ్చే ఉద్యోగావకాశాలను వివరించారు. ఛైర్మన్ కెవి.సత్యనారాయణ మాట్లాడుతూ 10వ తరగతిలో 500 మార్కులకుపైగా సాధించిన విద్యార్థులకు రూ.5 వేల రాయితీ అమలు చేస్తున్నామని చెప్పారు. కళాశాల కోశాధికారి కె.త్రినాధస్వామి మాట్లాడారు. పూర్వ విద్యార్థులు మాట్లాడారు.

హిండ్వేర్ స్మార్ట్ అప్లియన్స్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అభివృద్ధి చెందుతున్న భీమవరం పట్టణంలో ఎన్నో కార్పొరేట్ సంస్థలు తరలి వస్తున్నాయని, హిండ్వేర్ స్మార్ట్ అప్లియన్స్ స్టోర్ పట్టణంలో ప్రారంభించడం శుభ పరిణామమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం పోలీస్ బొమ్మ సెంటర్‌లో హిండ్వేర్ స్మార్ట్ కిచెన్ అప్లియన్స్ స్టోర్‌ను సోమవారం ఎంఎల్ఎ ప్రారంభించి మాట్లాడారు.


స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

ఆధునిక సాంకేతికతతో రూపుదిద్దుకున్న కొత్తరకం కిచెన్ అప్లియన్స్ అందుబాటులోకి రావడం ఆనందించదగ్గ విషయమన్నారు. ప్రొప్రైటర్ ప్రభాకర్, హిండ్వేర్ ఎఎస్ఎం పి.వెంకట సత్యసురేష్, పి.సురేష్, బ్రాంచ్ హెడ్ వెంకట్ గుప్తా మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 60 బ్రాంచులు ఉన్నాయని తెలిపారు.

యువ చైతన్యానికి స్ఫూర్తి నేతాజీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

యువ చైతన్యానికి స్ఫూర్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు లంకా కృష్ణమూర్తి, కార్యదర్శి దండు శ్రీనివాస్ రాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, బిజెపి సీనియర్ నాయకులు అరసవల్లి సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం శ్రీరాంపురం రోడ్డులోని రాజరాజేశ్వరి మున్సిపల్ పాఠశాలలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ అహింసా వాదం మాత్రమే స్వాతంత్ర సాధనకు సరిపోదని, పోరుబాట కూడా ముఖ్యమని బోసు భావన అన్నారు. హెచ్‌ఎం బి.మౌనిక, కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ బోసు మరణం వివాదాస్పదమైందన్నారు. ఉపాధ్యాయులు బండి దుర్గ మణి, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేసిన సర్వేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు

సర్వేశ్వరస్వామి దేవస్థాన పాలకమండలి ప్రమాణం

ప్రజాశక్తి - ఆచంట

కొడమంచిలిలోని సర్వేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీకార కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ పాల్గొన్నారు. నూతన కమిటీ ఛైర్మన్‌గా చిలుకూరి శ్రీనివాస్ ట్రస్ట్ సభ్యులతో ఆలయ కార్య నిర్వహణ అధికారి రామచంద్ర కుమార్ సభ్యులతో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు మన్నే సత్యనారాయణ బాబు, టిడిపి గ్రామాధ్యక్షులు చిలుకూరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు చిలుకూరి పట్టాభిరామయ్య, కొడమంచిలి నీటి సంఘం అధ్యక్షులు నెక్కంటి రామకృష్ణ, రైతు సంఘం అధ్యక్షులు నెక్కంటి భోగ శ్రీనివాసరావు, జనసేన నాయకులు తిర్దాల రాజేష్, టిడిపి నాయకులు బాలం వెంకటరమణ, మన్నే తేజ పాల్గొన్నారు.

బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పాలకొల్లు

సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే నూతన బార్ పాలసీ మూడేళ్లకు సంబంధించి పాలకొల్లు పట్టణానికి ఓపెన్ కేటగిరీలో 6 బార్ లకు నోటిఫికేషన్ వెలువడినట్లు ఎక్సైజ్ సిఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒక్కో అప్లికేషన్‌కు రూ.50,0000 (దరఖాస్తు రుసుము), రూ.10,000 అప్లికేషన్ ప్రాసెసింగ్ రుసుం నిర్ణయించినట్టు తెలిపారు. డ్రాలో బార్ దక్కించుకున్న వారికి ఓపెన్ కేటగిరి బార్‌కి రూ.55,00,000 సంవత్సర రుసుముగా నిర్ణయించినట్టు సిఐ తెలిపారు. ఈ పాలసీలో బార్ ఉదయం 10 గంటల నుండి రాత్రి 12 గంటల వరకూ టైమింగ్స్ నిర్ణయించినట్లు తెలిపారు.

నరసాపురం : నరసాపురం పట్టణ పరిధిలో 2025 నుంచి 2028 వరకూ బార్ల ద్వారా మద్యం అమ్మకాలు చేసుకునేందుకు ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా విధి విధానాలు ఖరారయ్యాయని ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మూడు బార్లకు కేటాయించారని తెలిపారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ గడువు ఉందని తెలిపారు. లాటరీ ద్వారా బార్లను కేటాయిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు రూ.5 లక్షల రుసుం చెల్లించి దరఖాస్తు ఫీజు అదనంగా రూ.10 వేల చెల్లించాలని పేర్కొన్నారు.

వికలాంగుల కడుపుకొట్టడం దుర్మార్గం

వైసిపి వికలాంగ విభాగం జిల్లా అధ్యక్షులు బుడితి సుజన్

ప్రజాశక్తి - తణుకు (అత్తిలి)

రాష్ట్రంలో బూటకపు హామీలు గుప్పించి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజలను అత్యంత దారుణంగా వంచిస్తూ దుర్మార్గపు పాలన సాగిస్తోందని వైసిపి వికలాంగ విభాగం జిల్లా అధ్యక్షులు బుడితి సుజన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారం చేపట్టిన వెంటనే అట్టహాసంగా పింఛన్లు నగదు పెంపుదల చేశామని చెప్పి మరోపక్క లక్షల మంది పింఛన్లు తొలగించి కూటమి ప్రభుత్వం పింఛనుదారుల ఉసురు పోసుకుంటోందని విమర్శించారు. ముఖ్యంగా వైకల్యం పున్ణపరిశీలన పేరుతో వికలాంగులను నెలలు తరబడి నానా యాతనకు గురి చేసి తీవ్ర మానసిక వేదనకు గురిచేసిందని తెలిపారు. తొలగించిన పింఛన్లు తక్షణం పునరుద్ధరణ చేయాలని కోరుతూ చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌ను వికలాంగులు ముట్టడించారని, ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

హామీలు అమలు చేస్తున్నాం

విప్ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - మొగల్తూరు

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, ముస్లిం మైనార్టీ విభాగం సలహాదారు ఎంఎ షరీఫ్ అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకంలో కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో రైతులకు తొలివిడతగా రూ.7 వేలు అందించిన నేపథ్యంలో సోమవారం మండలంలోని ముత్యాలపల్లి నుంచి విజయోత్సవ ర్యాలీని ప్రారంభించారు. ముత్యాలపల్లిలో ప్రారంభమైన ట్రాక్టర్ల ర్యాలీ మొగల్తూరు, రామన్నపాలెం, పసలదీవి, తూర్పుతాళ్లు, చామకూరిపాలెం, మోడీ, ఎల్‌బిచర్ల, సారవ, లక్ష్మణేశ్వరం మీదుగా నరసాపురం పట్టణ అంబేద్కర్ సెంటర్ వరకూ చేరుకుంది. మొగల్తూరులోని పిఎసిసి సొసైటీ ఛైర్మన్ నిప్పులేటి తారక రామారావు, సభ్యులు కవురు నాగేశ్వరరావు, మైలాబత్తుల రాంబాబు, సొసైటీ సిఇఒ కొత్తపల్లి గోవిందరాజులు సిబ్బంది నాయకులకు అరటిపండ్ల అందించి అభినందించారు. పాతకాలవ సెంటర్ ప్రాంతాల్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడారు. నియోజకవర్గంలో 11,967 మంది రైతులకు రూ.8.80 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, కొల్లాటి గోపి, పాలా రాంబాబు, బొల్ల చంటి, బోణం నర్సింహారావు, మెండి రాజేష్, దేశంశెట్టి శ్రీనివాస్, సత్య, అజా పాల్గొన్నారు.


విప్ నాయకర్‌కు అరటి పండ్ల గెలను అందజేస్తున్న సొసైటీ ఛైర్మన్ తారక రామారావు

నరసాపురం : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పాలన సాగిస్తోందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారం మొగల్తూరు మండలం ముత్యాలపల్లి నుంచి నిర్వహించిన అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీలో మైనార్టీ సలహాదారులు ఎంఎ షరీఫ్, ఇన్‌ఛారిజ పొత్తూరి రామరాజు, మత్యకార అభివద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజులతో కలిసి 150 ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది రైతులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మైలా వసంతరావు, కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, బందెల రవీంద్ర పాల్గొన్నారు.


షాపు ప్రారంభిస్తున్న నాయకర్, కొత్తపల్లి

ఎరువుల విక్రయ కేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - నరసాపురం

అన్నదాతలకు చేరువలో ఎరువుల విక్రయ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ముస్లిం మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎంఎ షరీఫ్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ (చిన్న) చొరవతో పట్టణంలోని పీచుపాలెంలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువులు, పురుగుమందులు, ఆక్వామేతల విక్రయ కేంద్రాన్ని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. డిసిఎంఎస్ ఛైర్మన్ చిన్న మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇప్పటి వరకూ 20 విక్రయ కేంద్రాలు ఉన్నాయని, తాజాగా నరసాపురంలో కూడా ప్రారంభించామని తెలిపారు. మరో 20కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, నిడదవోలులో రైసుమిల్లు నిర్మాణం, పెట్రోలు బంకు ఏర్పాటు చేయనున్నామన్నారు. జనరిక్ ఔషధ విక్రయ దుకాణాలు కూడా నెలకొల్పేందుకు చర్యలు చేపట్టామని, దీంట్లో భాగంగా నరసాపురంలో కూడా ఆ కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలకు తక్కువ ధరలకు ఆయా సామగ్రి అందించడమే తమ ధ్యేయమన్నారు. సార్వా నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు మాట్లాడారు.

వృద్ధుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రభుత్వం వృద్ధుల కనీస కోర్కెలు తీర్చాలని కోరుతూ తహశీల్దార్ వై.రవికుమార్, ఎస్ఐ కె.స్వామికి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పడాల జగన్నాథరెడ్డి, చిర్ల నరసింహారెడ్డి, ట్రెజరర్ కొత్త సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ పట్ల ప్రేమ, దయ కలిగి ఉండాలన్నారు. అన్ని రకాలుగా వారిని ఆదుకుని చట్టాలు అమలు చేయాలని కోరారు. కలెక్టర్, జిల్లా ఎస్‌పికి కూడా వినతిపత్రాలు సమర్పించామని తెలిపారు.

విద్యార్థినులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులకు ఒక్కొక్కరికీ 25 వేల రూపాయలు చొప్పున ఓరిగంటి సుందరి మెరిటోరియల్ యాన్యువల్ మెరిట్ స్కాలర్‌షిప్ కళాశాల పూర్వ విద్యార్థి అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల అలుమిని అసోసియేషన్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ప్రొఫెసర్ వికె.విశ్వనాథరాజు మాట్లాడుతూ మూడో సంవత్సరం వరకూ అత్యధిక మార్కులు సాధించిన ఇసిఇ విద్యార్థిని కె.ప్రవల్లిక 9.39 సిజిపిఎతో ప్రథమ స్థానంలో నిలిచిందని, అలాగే ఎఐఎంఎల్ బ్రాంచి మూడో సంవత్సరం విద్యార్థిని ఎం.ఈశ్వరి 9.67 సిజిపిఎతో ప్రథమ స్థానంలో నిలవడంతో వీరికి 25 వేల రూపాయలు చొప్పున అమెరికాలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో సిఇఒగా పనిచేస్తున్న 1995 ఇసిఇ పూర్వ విద్యార్థి ఓరిగంటి భరత్ తన తల్లి ఓరుగంటి సుందరి పేరిట అందజేశారని తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులకు కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, డైరెక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు చేతులు మీదగా చెక్కులు అందించారు. ఇసిఇ హెడ్ ఎన్.ఉదయ్ కుమార్, సిఎస్‌సి హెడ్ బిహెచ్‌వి.రామకృష్ణమరాజు, విద్యార్థినులు పాల్గొన్నారు.